క్లుప్తంగా

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలం సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి అడవికొలనుకు చెందిన నారిన వెంకటేశ్వరరావు, పుష్ప దంపతుల కుమార్తె సౌమ్యశ్రీ రూ.1,00,116 విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి కుటుంబ సభ్యులకు బాబా వారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం , బాబా వారి ప్రతిమతో సత్కరించారు.

భీమేశ్వరాలయంలో చండీ సహిత రుద్రయాగం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: కలవపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీఉమా భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చండీ సహిత సహస్రరుద్రయాగ పూర్వక అష్టోత్తర శతకలశ అభిషేకాలు, అభిషేక సహిత సామ్రాజ్య పట్టాభిషేకం, స్వామి వారి లీలా కల్యాణం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శైవాగమన శాస్త్ర ప్రకారం నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో లోక కల్యాణార్థం రామకోటి, శివకోటి స్తూపస్థాపనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

మావుళ్లమ్మకు గజమాల సమర్పణ



అమ్మవారికి అలంకరించిన గజమాల

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మకు తాడేపల్లిగూడేనికి చెందిన జ్యోష్ణవి, వెంకటేశ్వరావు, దుర్గ గజమాలను సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

పేదలకు అభయ హస్తం సీఎం సహాయ నిధి

భీమవరం: పేదలకు అభయ హస్తం సీఎం సహాయ నిధి అని, బాధిత కుటుంబాలకు ఏడీఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు రూ 46,28,610 చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని, మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందొచ్చని అన్నారు. ఇప్పటి వరకు 5 నెలల్లో 72 మందికి రూ.80,98,251 చెక్కులను భీమవరం నియోజకవర్గంలో అందించామని అన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో 'రాబిన్‌హుడ్' సందడి

భీమవరం: మైత్రి మూవీస్ నితిన్, శ్రీలీల జంటగా నిర్మించిన తాజా చిత్రం రాబిన్ హుడ్ ప్రమోషన్‌లో భాగంగా శనివారం రాత్రి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, కళాశాల పూర్వ విద్యార్థి రవిశంకర్ మాట్లాడుతూ తను చదువుకున్న రోజుల్లో పాఠాలు బోధించిన అధ్యాపకులను ఒక్కొక్కరిని గుర్తు చేసుకుంటూ ఇక్కడకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిత్ర బృందం విద్యార్థినీ విద్యార్థులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాల కల్చరల్ ఫెస్ట్ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ ,డైరెక్టర్ డాక్టర్ జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతాంగంపై విద్యుత్ పెనుభారం

- ఆక్వా రైతులకు 'కూటమి' కరెంట్ షాక్
- వాడకాన్ని బట్టి పెరుగుతున్న లోడు వ్యయం
- అదనపు లోడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు ఒత్తిడి
- కూటమి పాలనలో ఆక్వా రంగం కుదేలు



ఆక్వా చెరువుపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ఆక్వా చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

ఆకివీడు: కూటమి కరెంట్ షాక్‌తో ఆక్వా రైతు విలవిలలాడుతున్నాడు. ఒక పక్క విద్యుత్ బిల్లులు, మరో ప్రక్క ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడితో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రొయ్యల రైతుల వద్ద నుంచి ఏదో విధంగా డబ్బు వసూలు చేసేందుకు కూటమి సర్కార్ పన్నాగాలు పన్నుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ఎదురు చూస్తున్న రొయ్య రైతాంగానికి కరెంట్ షాక్ తగిలినట్లుగా నూతన నిర్ణయం ఉందని ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల వద్ద వినియోగిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీకి మించి విద్యుత్ వినియోగం చేస్తున్నారని, అదనపు సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

రైతాంగానికి అదనపు భారం

ప్రస్తుతం రొయ్యల చెరువుల వద్ద ఉన్న 25 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అదనపు లోడు పేరుతో 40 హెచ్‌పీ లోడు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తున్నారు. 25 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.35 లక్షలు ఉండగా, 40 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.2.83 లక్షలు ఉంది. అదనపు సొమ్మును రైతులే భరాయించాల్సి వస్తుందని వాపోతున్నారు. 63 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.2.80 లక్షలు ఉంది. అయితే రైతులకు 63 కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరితగతిన అందజేయడం లేదని, దీని వలన అదనపు భారం అవుతుందని రైతులు వాపోతున్నారు.

తగ్గని ఆక్వా చార్జీలు

విద్యుత్ చార్జీలను తగ్గించి, రైతులకు అండగా ఉంటామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం 9 నెలలు గడచినా ఆక్వా రంగానికి ఏ విధమైన సదుపాయాలు కల్పించలేదని వాపోతున్నారు. 10 ఎకరాల లోపు ఉన్న రైతులకే కాకుండా ఆక్వా రైతులు అందరికీ యూనిట్‌కు రూ.1.50 మాత్రమే చార్జీ వసూలు చేస్తామని వాగ్దానం చేసి, నేటికీ అమలు చేయలేదు. 10 ఎకరాల పైబడిన రైతులు ప్రస్తుతం యూనిట్ ధర రూ.3.85 కంటే అదనంగా 15 పైసలు ఇంధనపు చార్జీల వడ్డనతో చెల్లించవలసి వస్తోందని వాపోతున్నారు. నియోజకవర్గంలో 8,600 లకు పైగా ఆక్వా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రూ.18 కోట్లకు పైగా ఆదాయం ప్రతి నెలా ప్రభుత్వానికి వస్తుంది.

ట్రాన్స్‌ఫార్మర్లను సీజ్ చేయడం దారుణం



రొయ్యల చెరువుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానే కొత్త వాటిని వేయించుకోవాలని ట్రాన్స్‌కో ఒత్తిడి చేయడం దారుణం. ఆ విధంగా లోడు పెంచుకోని రైతాంగం వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు సీలు వేయడం దారుణం. ఇటువంటి సంఘటనలతో రైతుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా, రైతులు మానసికంగా కృంగిపోతారు. రైతులకు గడువు ఇచ్చి, కెపాసిటీ సామర్థ్యాన్ని పరిశీలించి అదనపు లోడుపై నిర్ణయం తీసుకోవాలి. ఒక్క క్షణం కరెంట్ లేకపోతే లక్షలు, కోట్లు నష్టం వచ్చే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం ఆక్వాను కనికరించాలి.

–పాతపాటి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, పెదకాపవరం

నియోజకవర్గంలో ఆక్వా విద్యుత్ కనెక్షన్లు

ఆకివీడు	2,300
కాళ్ల	2,600
ఉండి	2,500
పాలకోడేరు	1,200

సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

భీమవరం అర్బన్: మండలంలోని లోసరిలో రూ.3.55 కోట్లతో నిర్మించనున్న నూతన సబ్ స్టేషన్‌కు ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారధి, విద్యుత్‌శాఖ ఎస్‌సి ఆలపాటి రఘునాథబాబు, డిప్యూటీ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు, కాండ్రేగుల నరసింహారావు, ఏడీఈ వెంకటేశ్వరరావు, ఏఈ బాపూజీ, సర్పంచ్‌లు రామాని శివాజీ వర్మ, బొడ్డు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజును పరామర్శించిన ఎంపీపీ, జెడ్పీటీసీలు

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి పంచాయతీ ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజును వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు ఆదివారం తోకతిప్పలో పరామర్శించారు. ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితిలో విజయ నరసింహరాజు, నరసింహారావులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న వారికి అండగా ఉంటుందని అధైర్య పడవద్దని కొండరాజుకు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, పెనుమాల నరసింహాస్వామి తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రికి పరామర్శ



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను పరామర్శిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఇటీవల న్యూఢిల్లీలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన విషయం విదితమే. ఆదివారం స్థానిక కేంద్రమంత్రి స్వగృహానికి వీరు స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించి, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు గౌరీదేవి ప్రతిష్ఠ పూజలు

పెంటపాడు: గ్రామ ఇలవేల్పు వెలమ సంఘ ఆరాధ్య దేవత గౌరీదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని సుమారు రూ.కోటికి పైగా నిధులతో నిర్మించినట్లు తెలిపారు. ఆగమ పండితులు తుని తపోవన మఠాధిపతులు అనంత సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రతిష్ఠకు సంబంధించి 17 వరకు నిర్వహించే పూజల్లో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

ఉచిత ధ్యాన శిక్షణ



ధ్యానంలో పాల్గొన్న సభ్యులు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో యోగానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మామిడి లక్ష్మణ్ పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యానశిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత తో పాటు దుఃఖ రాహిత్యస్థితి పొందవచ్చునని తెలిపారు. అనంతరం సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, మెంటే అరుణ, కె.మోహన్‌కుమార్, పోలిశెట్టి బాబి, శిరీష, సుబ్బరాజు, నాగ ధనలక్ష్మి, పంజా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు ఎనలేనివి



హౌసింగ్ బోర్డ్ కాలనీలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

భీమవరం(ప్రకాశం చౌక్): పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో అభివృద్ధి కమిటీ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద వందన సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ డీపీవో అల్లూరి నాగరాజు (విజయనగరం), దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, సరిపిడకల రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు చేసిన సేవల గురించి కొనియాడారు. అదే విధంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టరేట్ ఏవో రాజశేఖర్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.గణపతిరావు, కె.వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కుక్కల బాలాజీ రాంప్రసాద్, మడిపల్లి చంద్రశేఖర్, కడలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు

భీమవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భీమవరం మావుళ్ళమ్మ దేవస్థానం వద్ద ఎమ్మెల్యే అంజిబాబు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. ఆయన చేసిన త్యాగ ఫలంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ భవనంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి రక్తదాతలు కావాలని సూచించారు. యువజన సంఘం అధ్యక్షుడు జూలూరి వెంకటేష్ మాట్లాడుతూ 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్షలు చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన 125వ జయంతి సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, 70 మంది రక్తదానం చేశారన్నారు. అనంతరం 74 సార్లు రక్తదానం చేసిన సమయమంతుల నానిని జేసీ, సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, తటవర్తి బదిరీ నారాయణ, వబిలిశెట్టి కిషోర్, పెరుమళ్ల శివ, బొండా నిషాంత్, కారుమూరి నితీష్, పులవర్తి కాశీ, బొండా ప్రవీణ్, అక్షింతల ప్రసాద్, కారుమూరి సత్యనారయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం ప్రసాద్

భీమవరం: ఈ నెల 19వ తేదీ బుధవారం విజయవాడలో తలపెట్టిన అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి యాత్రను జయప్రదం చేయాలని భీమవరం, ఉండి నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితుల కమిటీ తరపున ఎం.సీతారాం ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ డిపాజిట్‌దారుల సమావేశం ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఎం.సీతారాంప్రసాద్, కార్యదర్శి కె.గోపాలకృష్ణ మాట్లాడుతూ గత పదేళ్లుగా అసోసియేషన్ తరపున డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్ సొమ్ములు తిరిగి ఇప్పించడానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అనేకమంది డిపాజిట్ దారులు వారు దాచుకున్న సొమ్ము తీసుకోకుండానే చనిపోతున్నారని ఎప్పటికైనా వీరి ఆకలి చావులను అరికట్టి సొమ్మును తిరిగి ఇప్పించాలని కోరారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఉన్న ఏజెంట్లు కస్టమర్లు మహా ధర్నాలో పాల్గొనాలని వారు కోరారు. ఏవీ రాంబాబు, పి.నరసింహాచారి, బి.సరస్వతిరావు, ఈవీఎల్ నారాయణ, సింహాచలం, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పర్యావరణ ప్రేమికులు

ఉండి: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించకపోతే ప్రాణాలకు హాని కలుగుతుందని పర్యావరణ ప్రేమికులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ఉండిలో నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరామ క్షేత్రంలో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లు మట్టిలో కలవకపోవడంతో పర్యావరణం ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అనంతరం పాల్గొన్న వారికి చేతిసంచులను అందజేశారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, నల్లా ప్రసాద్, ఖండాపు శ్రీనివాసరావు, దాసరి వరదయ్య, ముదునూరి శివరామరాజు, ఆచారి మాస్టారు, మారెళ్ల కామేశ్వరి, అళగిరి సత్యానంద్, మాసాబత్తుల రామకృష్ణ, కాగిత మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతర మహోత్సవాలు ప్రారంభం



గ్రామ దేవతల జాతర మహోత్సవాన్ని ప్రారంభించిన భక్తులు





వీర్లంకమ్మ, పోలేరమ్మ విగ్రహాలు

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామంలో గ్రామ దేవతలు వీరంకమ్మ, పోలేరమ్మ పోతరాజుల జాతర మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆలయాల్లోని అమ్మవార్లను వీధిలో ఏర్పాటు చేసిన పూరి గుడిసెలోకి అంగరంగ వైభవంగా ఊరేగిస్తూ తీసుకొచ్చారు. వారం రోజుల పాటు గ్రామ పుర వీధుల గుండా అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. వచ్చే ఆదివారం అమ్మవార్లకు గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించుకుంటారు. కనుమూరు బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు, అబ్బాయిరాజు, రామకృష్ణంరాజు, ఆనంద వర్మ, అప్పలరాజు, బలరామరాజు(రాంబాబు), జంపన పెద రామరాజు పాల్గొన్నారు.

107 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ ఆవరణలో దాత పదం కుమార్ గుప్తా సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిలంచారు. 107 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించగా, ఉచితంగా 21 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 13 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యేక ట్రీట్‌మెంట్ నిమిత్తం 21 మందిని నిడదవోలు ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్, దాట్ల లక్ష్మీపతి రాజు, మదన్మోహన్ అగర్వాల్, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పచ్చా వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో నిత్యం నరకం



పాలకోడేరు రావి చెట్టు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్



భీమవరం–తణుకు రహదారిపై వెళుతున్న ఊక లోడు ట్రాక్టర్

- ట్రాఫిక్ జామవ్వడంతో వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని రవాణా, పోలీసు యంత్రాంగం

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. మూడు రోడ్ల కూడలి అయిన రావిచెట్టు సెంటర్‌లో రోజుకు అనేక సార్లు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తణుకు, వేండ్ర, భీమవరం వైపు వెళ్లే రహదారుల కూడలి రావిచెట్టు సెంటర్. అక్కడ పోలీసులు ట్రాఫిక్ నియంత్రించే కానిస్టేబుల్‌ను నియమించకపోవడంతో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఊక ట్రాక్టర్లతో ఇక్కట్లు

ఊక లోడు ట్రాక్టర్లు ప్రధాన రహదారుల్లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఊక లోడు ట్రాక్టర్లు రాత్రిపూట మాత్రమే తిరగాలన్న నిబంధన ఉన్నా పగటి పూట రోడ్ల వెంబడి ప్రయాణించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ఈ లోడ్ ట్రాక్టర్ల వెనుక ప్రయాణించేటప్పుడు సమయం వృథాతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు గమనించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్యపై రవాణా, పోలీస్ యంత్రాంగం దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.